APTEL/26/A4269

అనంత సూర్య

www.ananthasurya.com తెలుగువార్త

ప్రచురణ : అనంతపురం / శ్రీ సత్యసాయి ఎడిటర్ : సి హరికృష్ణ మంగళవారం 27 అక్టోబర్ 2026 సంపుటి: 01 సంచిక :150 పేజీలు : 04 వెల: 2-00/-

అర్ణబ్' తుపానుపై వదంతులు నమ్మొద్దు.. అప్రమత్తతో గండం నుంచి బయటపడదాం



బంగాళాఖాతంలో 'అర్ణబ్' తుపాను

రేపటికి అతి తీవ్ర తుపానుగా మారనున్న వైనం

అక్టోబర్ 28న బాపట్ల-విశాఖ మధ్య తీరం దాటే అవకాశం

ఏపీ, దక్షిణ ఒడిశా తీరాలకు రెడ్ అలర్ట్ జారీ

గంటకు 140 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే ప్రమాదం

రైతులు, మత్స్యకారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచన

అధికారిక సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలన్న మంత్రి అచ్చెన్నాయుడు

అమరావతి : బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం నేడు తుపానుగా మారింది. ఈ తుపానుకు 'అర్ణబ్' అని నామకరణం చేశారు. 'అర్ణబ్' తుపాను ఏపీ దిశగా వస్తోందని వాతావరణ నివేదికలు చెబుతున్నాయి. మిగతా..2లో

హైదరాబాద్‌లో డ్రగ్స్‌పై ఈగల్ ఫోర్స్ ఉక్కుపాదం



హైదరాబాద్‌లో గంజాయి విక్రయాలపై ఈగల్ ఫోర్స్ అధికారులు సోమవారం ఆకస్మిక దాడులు జరిపారు. ఈ తనిఖీల్లో ఎల్‌బీఎస్ నగర్‌లో ఇంటి నుంచే గంజాయి విక్రయిస్తున్న 75 ఏళ్ల షేక్ జాతెన్ బీ అరెస్ట్ చేశారు.

హైదరాబాద్, అక్టోబరు 26 : హైదరాబాద్‌లో గంజాయి విక్రయాలపై ఈగల్ ఫోర్స్ అధికారులు ఈరోజు (సోమవారం) ఆకస్మిక దాడులు జరిపారు. ఈ తనిఖీల్లో ఎల్‌బీఎస్ నగర్‌లో ఇంటి నుంచే గంజాయి విక్రయిస్తున్న 75 ఏళ్ల షేక్ జాతెన్ బీని అరెస్ట్ చేశారు. నిందితురాలి ఇంట్లో 41 గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఆమె దగ్గరి నుంచి మొత్తం 179.1 గ్రాముల గంజాయిని సీజ్ చేశారు. మిగతా..2లో

విశాఖ తూర్పు తీరాన్ని శాన్‌ఫ్రాన్సిస్కోగా తీర్చిదిద్దుతాం' - ఆనంద్ మహీంద్రా పోస్టుకు లోకేశ్ రిప్లై



- గంగవరం బీచ్ అందాలను పారిశ్రామిక దిగ్గజం ఆనంద్ మహీంద్రా ప్రపంచానికి పరిచయం చేయగా
- విశాఖ ప్రత్యేకతను చాటినందుకు 'ఎక్స్'లో ఆయనకు మంత్రి లోకేశ్ కృతజ్ఞతలు తెలిపారు.

అమరావతి : ప్రకృతి అందాలు, టెక్నాలజీ హంగులు ఈ రెండింటి కలయికతో విశాఖను ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని

ఎక్కడా కూడా ప్రాణ, ఆస్తి నష్టం జరగకూడదు..

అధికారులకు చంద్రబాబు కీలక ఆదేశాలు

- అర్ణబ్ తుపాను ముప్పు నేపథ్యంలో సీఎం చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష
- ఎలాంటి నష్టం జరగకుండా చూడాలని అధికారులకు స్పష్టమైన ఆదేశం
- బాపట్ల-విశాఖ మధ్య తీరం దాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిక
- గంటకు 140 కిలోమీటర్ల వేగంతో గాలులు, ఏపీ తీరానికి రెడ్ అలర్ట్ జారీ
- తీరప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని కలెక్టర్లకు సూచన



అమరావతి: బంగాళాఖాతంలో ఏర్పడిన 'అర్ణబ్' తుపాను ఆంధ్రప్రదేశ్ తీరం వైపు దూసుకొస్తున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధికార యంత్రాంగాన్ని పూర్తిస్థాయిలో అప్రమత్తం చేశారు. తుపాను కారణంగా ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూడటమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని ఆయన స్పష్టం చేశారు. సోమవారం తన క్యాంపు కార్యాలయంలో ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షలో తుపానును ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఆయన కీలక ఆదేశాలు జారీ చేశారు. తుపాను గమనాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, దాని తీవ్రతకు అనుగుణంగా ప్రజలను అప్రమత్తం చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. "తుపాను ప్రభావంతో కురిసే వర్షాలు, మిగతా..2లో

ఏపీకి అర్ణబ్ ముప్పు

అప్రమత్తమైన ప్రభుత్వం

- బంగాళాఖాతంలో కొనసాగుతున్న తుపాను కొన్ని గంటల్లో తీవ్ర తుపానుగా మారనుంది.
- రేపు అతి తీవ్ర తుపానుగా మారనుంది.
- ఈ క్రమంలోనే సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు అధికారులు అప్రమత్తమయ్యారు.



ఢిల్లి : బంగాళాఖాతంలో అర్ణబ్ తుపాను తీరం దిశగా దూసుకొస్తుంది. గడిచిన 6 గంటల్లో 13 కిలోమీటర్ల వేగంతో పశ్చిమ దిశగా కదులుతోంది. విశాఖకు 580 కిలోమీటర్లు, కాకినాడకు 660 కిలోమీటర్లు, మచిలీపట్నానికి 760 కిలోమీటర్లు, బాపట్లకు 830 కిలోమీటర్లు, గోపాల్‌పూర్ (ఒడిశా)కు 550 కిలోమీటర్ల దూరంలో తుపాను కేంద్రీకృతమైంది. ఈ క్రమంలోనే ఇవాళ అర్ధరాత్రికి నాటికి తీవ్ర తుపానుగా బలపడనుంది. రేపు (మంగళవారం) అతి తీవ్ర తుపానుగా మారనుంది. ఎల్లుండి (బుధవారం) ఉదయం బాపట్ల-విశాఖ మధ్య యానాం వద్ద తీరం దాటే అవకాశం ఉంది. తీరం దాటే సమయంలో గరిష్ఠంగా 140 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయని అధికారులు తెలిపారు. రేపు, ఎల్లుండి కొన్నిచోట్ల అత్యంత భారీ వర్షాలు కురవడంతో పాటు బలమైన ఈదురుగాలులు మిగతా..2లో

ప్రధానిపై ఖర్గే వ్యాఖ్యలు.. తీవ్రంగా స్పందించిన రాంచందర్ రావు



- ప్రధాని తండ్రిని ఉద్దేశించి ఖర్గే వివాదాస్పద వ్యాఖ్యలు
- తీవ్రంగా ఖండించిన తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు
- అధికారానికి దూరమవడంతో కాంగ్రెస్‌లో అసహనం అని వ్యాఖ్య

ఢిల్లి: ప్రధాని మోదీని ఉద్దేశించి కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

క్రిమినల్స్ నడిపే పార్టీ బీజేపీ'- రాహుల్ కేసులో

కోర్టు తీర్పును స్వాగతించిన కాంగ్రెస్

పరువు నష్టం కేసులో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని సుల్తాన్‌పుర్ ప్రత్యేక కోర్టు నిర్దోషిగా ప్రకటించగా, ఆ తీర్పును స్వాగతిస్తూ బీజేపీపై తీవ్ర విమర్శలు చేసింది హస్తం పార్టీ.



ఢిల్లి : పరువు నష్టం కేసులో లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి ఊరట లభించడంతో బీజేపీపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించింది కాంగ్రెస్. బీజేపీని నేరస్థులు నడిపే పార్టీగా అభివర్ణించింది. గాంధేయ మార్గంలో పోరాడి, ప్రేమ, కరుణ, పట్టుదలతో బీజేపీని ఓడిస్తామని పేర్కొంది. బీజేపీ నేత అమిత్ షాపై 2018లో చేసిన వ్యాఖ్యలకు సంబంధించి ఆయనపై నమోదైన పరువు నష్టం కేసులో ఉత్తర్ ప్రదేశ్‌లోని సుల్తాన్‌పుర్ ప్రత్యేక ఎంపీ, ఎమ్మెల్యే కోర్టు నిర్దోషిగా సోమవారం ఉదయం ప్రకటించగా, ఆ తీర్పును కాంగ్రెస్ స్వాగతించింది. నిజం గెలిచిందని పేర్కొంది. బీజేపీ అధికారంలోకి రావడానికి నేరాలకు పాల్పడిన వారిని ప్రోత్సహిస్తోందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఆరోపించారు. ఆ పార్టీని ఓడించేందుకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. అయితే ఆ పోరాటం హింసకు తావులేకుండా మహాత్మా గాంధీ చూపిన మార్గంలోనే సాగుతుందని చెప్పారు. ప్రేమ, కరుణ, పట్టుదలతో బీజేపీని ఎదుర్కొంటామని పేర్కొన్నారు. రాహుల్ గాంధీ 2018లో చేసిన వ్యాఖ్యల్లో పరువు నష్టం కలిగించే అంశం లేదని కోర్టు స్పష్టం చేసిందని కేసీ వేణుగోపాల్ పేర్కొన్నారు. అమిత్ షాను వ్యక్తిగతంగా మిగతా..2లో

96 గంటల్లో ఇరాన్‌పై భీకర దాడులకు యూఎస్ ప్లాన్ చేస్తోందా?

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదేశాలు అందిన 96 గంటల్లో, యూఎస్ సైనిక బలగాలు ఇరాన్ పై భారీ దాడులు చేయడానికి సిద్ధం ఉన్నట్లు ఓ తాజా నివేదిక పేర్కొంది.



ఢిల్లి : అమెరికా, ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం గురించి తర్జనభర్జన జరుగుతున్న వేళ, తాజాగా ఓ నివేదిక కీలక విషయాలు వెల్లడించింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదేశాలు అందిన 96 గంటల్లోగా, ఇరాన్ పై భారీ సైనిక దాడులు చేసేందుకు పశ్చిమాసియాలోని యూఎస్ బలగాలు సిద్ధంగా ఉన్నాయని పేర్కొంది. అంతేకాదు ఈ సైనిక దాడులు నిర్వహించడానికి ఆ ప్రాంతంలో తగినంత స్థాయిలో అమెరికా సైనిక బలగాలను మోహరించినట్లు పేర్కొంది. ఈ విషయాన్ని అమెరికాకు చెందిన ఇద్దరు అధికారులు వెల్లడించినట్లు సీఎన్ ఎన్ తన నివేదికలో పేర్కొంది. ఇరాన్ రాడార్లు, క్షిపణి ప్రయోగ కేంద్రాలు, ఇతర సైనిక ఆస్తులు, స్థావరాలపై భారీ దాడులు చేసేందుకు అనువుగా అమెరికా సన్నాహాలు చేస్తున్నట్లు సదరు నివేదిక వెల్లడించింది. "ఇది చాలా పెద్ద ప్రయత్నం అవుతుంది" అని సదరు అమెరికా అధికారులు చెప్పినట్లు వెల్లడించింది. "మాజీ అమెరికా అధికారులు కూడా ఇదే విధంగా భావిస్తున్నారు. అయితే వారిలో కొందరు ట్రంప్ ఈ దాడులకు ఆదేశాలు జారీ చేస్తారా, లేదా అనే అనుమానం తమకు లేదని, అయితే ఎప్పుడు ఆదేశిస్తారు అన్నదే తమ ముందున్న ప్రశ్న అని చెప్పారు. బహుశా ఈ ఆదేశం ఈ ఏడాది చివర్లో ఎప్పుడైనా రావచ్చు, బహుశా అమెరికా మధ్యంతర ఎన్నికల తర్వాత వచ్చే అవకాశం ఉంది" అని నివేదిక పేర్కొంది.

ఇరాన్‌తో యుద్ధం అంత సులువు కాదు!

నివేదిక ప్రకారం, మిగతా..2లో

290 కోట్లు దాటిన మహిళల ఉచిత బస్సు ప్రయాణాలు.. రేవంత్ రెడ్డి స్పందన



- మహాలక్ష్మి పథకంతో మహిళలకు రూ.10,000 కోట్ల ఆదా
- రోజూ 35 లక్షల మందికి పైగా మహిళలు వినియోగించుకుంటున్న పథకం
- ఈ పథకం మహిళల ఆత్మగౌరవానికి, స్వేచ్ఛకు, స్వావలంబనకు ప్రతీక అన్న సీఎం

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ పథకం ఓ కీలక మైలురాయిని చేరుకుంది. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని మహిళలు ఇప్పటివరకు ఏకంగా రూ.10,000 కోట్లకు పైగా ఆదా చేసుకున్నారని టీజీఎస్ఆర్టీసీ వెల్లడించింది. పథకం ప్రారంభమైన నాటి నుంచి సుమారు 28 నెలల్లో 290 కోట్లకు పైగా ఉచిత ప్రయాణాలు నమోదయ్యాయని తెలిపింది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా రోజూ 35 లక్షల మందికి పైగా మహిళలు ఈ సౌకర్యాన్ని వినియోగించుకుంటున్నారు.

తుమ్మిడిహెట్టిపై గుడ్‌న్యూస్.. తెలంగాణ ప్రతిపాదనకు

ఫడ్నవీస్ సానుకూలం!

- తుమ్మిడిహెట్టి ఎత్తు పెంపుపై ఫడ్నవీస్ సానుకూలం
- 152 మీటర్లకు పెంచాలని తెలంగాణ ప్రతిపాదన
- అధ్యయనానికి అధికారుల కమిటీ ప్రతిపాదన
- రెండు లక్షల ఎకరాలకు సాగునీరు లక్ష్యం
- ముంపు భూములకు పరిహారం చెల్లిస్తామని హామీ



హైదరాబాద్: తెలంగాణలోని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రైతుల సాగునీటి కల నెరవేరే దిశగా కీలక ముందడుగు పడింది. ప్రాణహిత నదిపై తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తును 152 మీటర్లకు పెంచాలన్న తెలంగాణ ప్రతిపాదనపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ సానుకూలంగా స్పందించారు. ఎత్తు పెంపుతో మహారాష్ట్రకు ఎలాంటి ప్రతికూల ప్రభావం ఉండకూడదని స్పష్టం చేస్తూనే.. తెలంగాణ నీటి అవసరాలకు సహకరించేందుకు అభ్యంతరం లేదని తెలిపారు. అయితే, బ్యారేజీ ఎత్తు పెంపుపై తుది నిర్ణయం తీసుకునే ముందు అన్ని అంశాలపై సమగ్ర అధ్యయనం చేయాల్సి ఉందని అన్నారు. ముంబైలోని సహ్యాద్రి రాష్ట్ర అతిథిగృహంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని బృందం ఫడ్నవీస్‌తో సోమవారం సమావేశమైంది. నీటిపారుదల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహా ఉన్నతాధికారులు ఇందులో పాల్గొన్నారు. గతంలో రెండు రాష్ట్రాల మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం బ్యారేజీ ఎత్తు 148 మీటర్లుగా ఉంది. అయితే, ఆ ఎత్తుతో ఆశించిన స్థాయిలో నీటిని తరలించడం సాధ్యం కాదని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోంది. మిగతా..2లో

హైదరాబాద్‌లో అమిత్ షా

పాదయాత్ర..



కాంగ్రెస్ ర్యాలీకి మరుసటి రోజే బీజేపీ కౌంటర్!

- నవంబర్ 2న హైదరాబాద్‌లో బీజేపీ పాదయాత్ర
- అమిత్ షా పాల్గొంటారని రామచందర్‌రావు ప్రకటన
- నవంబర్ 1న ఢిల్లీలో కాంగ్రెస్ 'ఓట్ చోరీ' ర్యాలీ
- ఎస్ఐఆర్‌పై బీజేపీ, కాంగ్రెస్ మధ్య మాటల యుద్ధం
- ఓటర్ల పేర్ల తొలగింపుపై రేవంత్‌రెడ్డికి బీజేపీ నేత సవాల్

హైదరాబాద్: తెలంగాణలో ఓట్ల తొలగింపు అంశంపై బీజేపీ, కాంగ్రెస్ మధ్య రాజకీయ పోరు మరింత వేడెక్కుతోంది.

మొదటి పేజి తరువాయి

ఎక్కడా కూడా ప్రాణ, ఆస్తి నష్టం జరగకూడదు.. అధికారులకు చంద్రబాబు కీలక ఆదేశాలు

వీచే గాలులు, సంభవించే వరద ప్రవాహాల తీవ్రతను ముందుగానే అంచనా వేయాలి. గతంలో వచ్చిన తుపానుల సమాచారాన్ని విశ్లేషించి రైతులకు, ప్రజలకు నిరంతరం హెచ్చరికలు జారీ చేయాలి. ఎలాంటి నష్టం జరగకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపైనా ఉంది" అని చంద్రబాబు అన్నారు. తీరప్రాంతాల్లోని ప్రజలను వెంటనే గుర్తించి, సమీపంలోని తుపాను షెల్టర్లకు తరలించాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, ఆర్టీజీఎస్, విపత్తు నిర్వహణ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. వివిధ జిల్లాల కలెక్టర్లు, పోలీసు అధికారులు వర్చువల్ విధానంలో హాజరై తమ జిల్లాల్లోని పరిస్థితులను, తీసుకుంటున్న చర్యలను ముఖ్యమంత్రికి వివరించారు. వాతావరణ శాఖ హెచ్చరికల ప్రకారం, 'అర్ణబ్' తుపాను అక్టోబర్ 26 అర్ధరాత్రికి తీవ్ర తుపానుగా, 27న అతి తీవ్ర తుపానుగా బలపడనుంది. అక్టోబర్ 28వ తేదీ ఉదయం బాపట్లవిశాఖపట్నం మధ్య తీరం దాటే అవకాశం ఉంది. తీరం దాటే సమయంలో గంటకు 115 నుంచి 125 కిలోమీటర్లు, గరిష్ఠంగా 140 కిలోమీటర్ల వేగంతో పెనుగాలులు వీచే ప్రమాదం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో అక్టోబర్ 27, 28 తేదీల్లో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని, అందువల్ల ఆంధ్రప్రదేశ్, దక్షిణ ఒడిశా తీరప్రాంతాలకు రెడ్ అలర్ట్ జారీ చేసినట్లు వాతావరణ శాఖ ప్రకటించింది.

తుమ్మిడిహెట్టిపై గుడ్‌న్యూస్.. తెలంగాణ ప్రతిపాదనకు ఫడ్నవీస్ సానుకూలం!

అందుకే 152 మీటర్లకు పెంచాలని కోరుతోంది.

అధ్యయనానికి అధికారుల కమిటీ

బ్యారేజీ ఎత్తు, నీటి లభ్యత, ముంపునకు గురయ్యే భూములు, ప్రభావిత ప్రాంతాలు, పరిహారం వంటి అంశాలపై రెండు రాష్ట్రాల నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శుల నేతృత్వంలో అధికారుల కమిటీ ఏర్పాటు చేయాలని ఫడ్నవీస్ ప్రతిపాదించారు. అవసరమైతే ప్రత్యామ్నాయాలపైనా అధ్యయనం చేయాలని సూచించారు. కేంద్ర జల సంఘం కూడా తన పరిధిలో సాంకేతిక అంశాలను పరిశీలించనుంది.

రెండు లక్షల ఎకరాలకు సాగునీరు

తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని సుమారు రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలన్నది తెలంగాణ ప్రభుత్వ లక్ష్యం. గిరిజన, అటవీ ప్రాంతాల్లో సాగు, తాగునీటి సమస్యలను పరిష్కరించేందుకు ఈ ప్రాజెక్టు కీలకమని రేవంత్‌రెడ్డి వివరించారు. బ్యారేజీ వల్ల మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే భూములకు అక్కడి నిబంధనల ప్రకారం పూర్తి పరిహారం చెల్లిస్తామని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హామీ ఇచ్చారు. బ్యారేజీ ఎత్తు ఖరారైతే తుమ్మిడిహెట్టి నుంచి ఎల్లంపల్లికి నీటిని తరలించే మార్గం రూపకల్పన, భూసేకరణ వంటి పనులను వేగవంతం చేయాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోంది. చర్చలు సానుకూలంగా సాగినా.. నిర్మాణానికి తుది అనుమతి లభించిందని ఇప్పుడే చెప్పలేం. అధికారుల అధ్యయనం, తదుపరి చర్చల తర్వాతే దీనిపై స్పష్టత రానుంది.

హైదరాబాద్‌లో డ్రగ్స్‌పై ఈగల్ ఫోర్స్ ఉక్కుపాదం

ఈ ఆపరేషన్‌లో 70 మంది గంజాయి వినియోగదారులను గుర్తించారు. 66 మందికి వైద్య పరీక్షలు జరపగా.. ఈ పరీక్షల్లో డ్రగ్స్ తీసుకున్నట్లుగా పాజిటివ్‌గా నిర్ధారించారు. గంజాయి వినియోగదారుల్లో ముగ్గురు బాలురని, మరో 65 మందిని పునరావాస కేంద్రాలకు ఈగల్ అధికారులు తరలించారు. అలాగే, గాంధీ రిహాబిలిటేషన్ సెంటర్‌కు 45 మందిని, ఆమనగల్ కేంద్రానికి 15 మంది, కొత్తూరు కేంద్రానికి ఐదుగురిని తరలించారు. ఈ కేసుతో సంబంధం ఉన్న మరో ఐదుగురు పరారీలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. పరారీలో ఉన్న వారి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. గంజాయి సరఫరా మూలాలు, ఇతర వ్యక్తుల పాత్రపై ఈగల్ అధికారులు ప్రత్యేకంగా దర్యాప్తు చేస్తున్నారు. నిందితురాలు షేక్ జాతెన్ బీపై గతంలో మరో ఏడు కేసులు ఉన్నట్లు గుర్తించారు.

గచ్చిబౌలిలో డ్రగ్స్ పట్టివేత

అలాగే, గచ్చిబౌలిలో తెలంగాణ టాస్క్‌ఫోర్స్ టీమ్ తనిఖీలు చేసి డ్రగ్స్‌ను పట్టుకున్నారు. ఖాజాగూడా సర్వీస్ రోడ్డులో డ్రగ్స్ విక్రయిస్తుండగా ఫొటోగ్రాఫర్ ఏ. సాయిరామ్‌ను అరెస్ట్ చేశారు. నిందితుడు సాయిరామ్ నుంచి 4.45 గ్రాముల వీణపీనా డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. గ్రాము రూ.10 వేల చొప్పున అతడు డ్రగ్స్ విక్రయిస్తున్నట్లు గుర్తించారు. నిందితుడి నుంచి కారు, డిజిటల్ వేయింగ్ మిషన్, 2 సెల్‌ఫోన్లను సీజ్ చేశారు. పరారీలో ఉన్న మరో ఇద్దరు నిందితులు మహేశ్‌రెడ్డి, తాండ్ర హరిశ్చంద్ర కోసం గాలింపు చర్యలు చేపట్టారు. నిందితులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రాజమండ్రికి చెందినవారిగా గుర్తించారు

ప్రధానిపై ఖర్గే వ్యాఖ్యలు.. తీవ్రంగా స్పందించిన రాంచందర్ రావు

అంతటి సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న సీనియర్ నేత ఇంత దిగజారుడు భాష మాట్లాడటం అత్యంత విచారకరమని అన్నారు. హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన రాంచందర్ రావు... గత పన్నెండున్నర ఏళ్లుగా అధికారానికి దూరంగా ఉండటంతో కాంగ్రెస్ నేతల్లో తీవ్రమైన అసహనం కనిపిస్తోందని విమర్శించారు. ఆ నిరాశా నిస్పృహల నుంచే మోదీ తండ్రిని కూడా నిందిస్తూ ఖర్గే వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. ఖర్గే మాట్లాడిన సభలో వేదికపై ఉన్న నేతల కంటే కింద ఉన్న ప్రేక్షకులు చాలా తక్కువగా ఉన్నారని ఆయన ఎద్దేవా చేశారు. బీహార్‌లోని పాట్నాలో నిన్న జరిగిన ఓ కార్యక్రమంలో మల్లికార్జున ఖర్గే ప్రసంగిస్తుండగా... ఓ వ్యక్తి మోదీ ఓడిపోరంటూ నినాదాలు చేశారు. దీనికి స్పందించిన ఖర్గే.. 'మోదీ కా బాప్ భీ జాయేగా' (మోదీ అబ్బ కూడా దిగిపోవాల్సిందే) అంటూ వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా రాజకీయ దుమారం రేపాయి. కేంద్ర హోం మంత్రి అమిత్ షా సహా పలువురు బీజేపీ నేతలు ఖర్గే వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనపై పాట్నాలోని పోలీస్ స్టేషన్‌లో బీజేపీ నేతలు ఫిర్యాదు కూడా చేశారు. దీంతో ఈ వివాదం మరింత ముదిరింది.

290 కోట్లు దాటిన మహిళల ఉచిత బస్సు ప్రయాణాలు.. రేవంత్ రెడ్డి స్పందన

దీనివల్ల టీజీఎస్ఆర్టీసీ బస్సుల్లో మహిళా ప్రయాణికుల వాటా 40 శాతం నుంచి 67 శాతానికి పైగా పెరిగింది. మహిళల నుంచి వస్తున్న భారీ స్పందనతో మొత్తం ఆక్యుపెన్సీ రేటు కూడా 69 శాతం నుంచి 98 శాతానికి చేరడం విశేషం. తాము అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే ఈ పథకాన్ని ప్రారంభించామని ప్రభుత్వం పలు సందర్భాల్లో గుర్తుచేసింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందిస్తూ... మహాలక్ష్మి పథకం కేవలం ఉచిత ప్రయాణం మాత్రమే కాదని, మహిళల ఆత్మగౌరవానికి, స్వేచ్ఛకు, స్వావలంబనకు ప్రతీక అని పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా మహిళలపై ఆర్థిక భారం గణనీయంగా తగ్గిందని, వారు విద్య, ఉపాధి, ఇతర అవసరాల కోసం స్వేచ్ఛగా ప్రయాణించగలుగుతున్నారని తెలిపారు. పెరిగిన డిమాండ్‌కు అనుగుణంగా మరిన్ని బస్సు సర్వీసులను నడిపేందుకు టీజీఎస్ఆర్టీసీ చర్యలు తీసుకుంటోందని చెప్పారు.

పార్లమెంట్ వద్ద అగ్నిప్రమాదం- అసలేమైందంటే?

పార్లమెంట్ సమీపంలోని నార్త్ బ్లాక్‌లో సోమవారం భారీగా పొగలు వచ్చాయి. అయితే మరమ్మతుల సమయంలో మంటలు చెలరేగి ఉండొచ్చని అధికారులు భావిస్తున్నారు.

దేశ రాజధాని దిల్లీలోని పార్లమెంట్ సమీపంలో ఉన్న నార్త్ బ్లాక్‌లో అగ్నిప్రమాదం సంభవించింది. సోమవారం ఉదయం భవనం వెనుక వైపు నుంచి దట్టమైన నల్లటి పొగలు రావడంతో అక్కడ కలకలం రేగింది. వెంటనే అప్రమత్తమైన అగ్నిమాపక శాఖ సిబ్బంది ఆరు వాహనాలతో అక్కడికి చేరుకున్నారు. మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని అధికారులు తెలిపారు. నార్త్ బ్లాక్‌లో ప్రస్తుతం మరమ్మతులు, కొన్ని పనులు జరుగుతున్నాయి. భవనం పైకప్పుపై కార్మికులు వెల్డింగ్ పనులు చేస్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగినట్లు ప్రాథమిక సమాచారం. అక్కడ ఏర్పాటు చేసిన ఏసీ బాయిలర్ వద్ద మంటలు చెలరేగినట్లు అగ్నిమాపక శాఖ తెలిపింది. వెల్డింగ్ పనుల సమయంలో షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు వచ్చి ఉండొచ్చని అధికారులు భావిస్తున్నారు. అయితే, ప్రమాదానికి కచ్చితమైన కారణం ఏమిటనేది ఇంకా నిర్ధారణ కాలేదు. సోమవారం ఉదయం 11.10 గంటలకు నార్త్ బ్లాక్ నుంచి పొగలు వస్తున్నట్లు దిల్లీ అగ్నిమాపక శాఖకు సమాచారం అందింది. దీంతో వెంటనే ఆరు అగ్నిమాపక వాహనాలను ఘటనాస్థలికి పంపించారు. సిబ్బంది అక్కడికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. మంటలు ఇతర ప్రాంతాలకు వ్యాపించకుండా చర్యలు చేపట్టారు. కొద్దిసేపటికే మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకొచ్చినట్లు అధికారులు వెల్లడించారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. కానీ భవనానికి ఎంతమేర నష్టం జరిగిందనే వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. వెల్డింగ్ పనుల సమయంలో మంటలు ఎలా చెలరేగాయి, ఏసీ బాయిలర్ వద్ద ప్రమాదానికి దారితీసిన పరిస్థితులు ఏమిటనే అంశాలపై పూర్తి వివరాలు వెల్లడికావాల్సి ఉంది.


నార్త్ బ్లాక్ చరిత్ర ఏంటి?

అయితే నార్త్ బ్లాక్ దిల్లీలోని రైసినా హిల్స్ ప్రాంతంలో ఉంది. ఇది కేంద్ర ప్రభుత్వానికి చెందిన ముఖ్యమైన కార్యాలయాలున్న భవనం. ఇక్కడ కేంద్ర హోం శాఖ, ఆర్థిక శాఖ కార్యాలయాలు ఉన్నాయి. పార్లమెంట్ భవనానికి సమీపంలో ఉండటంతో ఈ ప్రాంతం ఎప్పుడూ కీలకంగా ఉంటుంది. అలాంటి భవనంలో పొగలు రావడంతో అగ్నిమాపక సిబ్బంది వెంటనే స్పందించారు. ఈ ఘటనపై రాజ్యసభ సభ్యుడు మిలింద్ దేవ్‌రా కూడా స్పందించారు. పార్లమెంట్‌కు వెళ్తున్న సమయంలో నార్త్ బ్లాక్ వెనుక వైపు నుంచి దట్టమైన పొగలు రావడం గమనించినట్లు ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. అక్కడ అగ్నిప్రమాదం జరిగి ఉండొచ్చని పేర్కొంటూ, అందరూ సురక్షితంగా ఉండాలని ఆకాంక్షించారు. అత్యవసర సేవల సిబ్బంది వేగంగా స్పందిస్తున్నారని ఆశిస్తున్నట్లు తెలిపారు. పొగలు వస్తున్న దృశ్యానికి సంబంధించిన ఫొటోను కూడా ఆయన పంచుకున్నారు.

విశాఖ తూర్పు తీరాన్ని శాన్‌ఫ్రాన్సిస్కోగా తీర్చిదిద్దుతాం' - ఆనంద్ మహీంద్రా పోస్టుకు లోకేశ్ రిప్లై

మొదటి పేజి తరువాయి

మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. గంగవరం బీచ్ అందాలను పారిశ్రామిక దిగ్గజం ఆనంద్ మహీంద్రా ప్రపంచానికి పరిచయం చేయగా, విశాఖ ప్రత్యేకతను చాటినందుకు ఆయనకు మంత్రి లోకేశ్ కృతజ్ఞతలు తెలిపారు. కొండలు సముద్రాన్ని తాకే తీరం, ఎత్తైన రాతి కొండచరియలు, వేగంగా విస్తరిస్తున్న టెక్నాలజీ రంగం ఇవే విశాఖ అసలైన బలాలని వివరించారు. ప్రకృతి సౌందర్యాన్ని దెబ్బతీయకుండా ప్రపంచ స్థాయి సాంకేతిక పరిశ్రమలు అభివృద్ధి చెందేలా నగరాన్ని తీర్చిదిద్దాలన్నదే తమ విజన్ అని లోకేశ్ తెలిపారు. తూర్పు తీరానికి శాన్‌ఫ్రాన్సిస్కోగా విశాఖను నిలబెడతామన్నారు. ప్రకృతి, ప్రగతి కలిసి నడిచే నగరంగా విశాఖను తీర్చిదిద్దుతామని లోకేశ్ వెల్లడించారు. గంగవరం బీచ్‌పై ఆనంద్ మహీంద్రా చేసిన పోస్టుకు మంత్రి లోకేశ్ 'ఎక్స్' వేదికగా స్పందించారు.



గంగవరం బీచ్‌పై ఆనంద్ మహీంద్రా ఆసక్తికర పోస్టు :

విశాఖపట్నం సమీపంలోని గంగవరం బీచ్ సుందర దృశ్యాలకు ప్రముఖ వ్యాపారవేత్త ఆనంద్ మహీంద్రా ఫిదా అయ్యారు. దీంతో గంగవరం బీచ్ గురించి ఆనంద్ మహీంద్రా 'ఎక్స్'లో ఆసక్తికర పోస్టు చేశారు. దేశంలో ఎక్కువ మంది మాట్లాడుకునే తీరప్రాంత ప్రదేశాల్లో గంగవరం బీచ్ ఎందుకు లేదని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. "ఇది మనకు తెలిసిన కొబ్బరి చెట్లు, పచ్చదనం దృశ్యాలు కనిపించే సాధారణ బీచ్ లాంటిది కాదు. ఎత్తయిన రాతి కొండలతో కఠినమైన, ఒకవిధమైన పురాతన అందం ఇక్కడ కనిపిస్తోంది. ఇలాంటి సహజ సౌందర్యమే నన్ను ఎక్కువగా ఆకర్షిస్తుంది. ఇక్కడ సేద తీరడమే కాకుండా, ప్రశాంతంగా కాసేపు ఆత్మపరిశీలన కూడా చేసుకోవచ్చు. ప్రస్తుతం ప్రపంచంలోని టెక్ దిగ్గజాలు. భారీ డేటా సెంటర్లు, ఏఐ మౌలిక సదుపాయాల నిర్మాణానికి వైజాగ్‌కు వస్తున్నాయి. కానీ, ఇక్కడి దృశ్యాలను చూస్తుంటే లక్షల ఏళ్ల క్రితమే ప్రకృతి పెద్దఎత్తున విస్తరణ ప్రక్రియను మొదలుపెట్టినట్లు అనిపిస్తోంది. విశాఖపట్నం ప్రధాన టెక్ హబ్‌గా వేగంగా మారుతోంది. అదేవిధంగా అత్యంత అద్భుతమైన తీరప్రాంత పర్యాటక ప్రదేశంగానూ వెలుగొందే సత్తా దీనికి ఉందని భావిస్తున్నా" అని ఆనంద్ మహీంద్రా 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. నెటిజన్లు ఆయన వ్యాఖ్యలతో ఏకీభవించారు.

96 గంటల్లో ఇరాన్‌పై భీకర దాడులకు యూఎస్ ప్లాన్ చేస్తోందా?

మొదటి పేజి తరువాయి

ఇరాన్ బలగాలకు ఇప్పుడు అమెరికా సైనిక వ్యూహాలపై బాగా అవగాహన ఏర్పడింది. అందువల్ల అమెరికా సైన్యానికి, ఇరాన్ లోని లక్ష్యాలను ఛేదించడం కాస్త కష్టతరంగానే ఉంటుందని సదరు అధికారులు అంగీకరించారు. ఏది ఏమైనప్పటికీ, యూఎస్ సెంట్రల్ కమాండ్ , పెంటగాన్ అధికారులు ఇరాన్ లోని ఇంధన మౌలిక సదుపాయాలు, సైనిక స్థావరాలు, అణుకర్మాగారాలతో సహా వివిధ కీలక లక్ష్యాల జాబితాను రూపొందిస్తున్నారు. మధ్యంతర ఎన్నికల తర్వాత ఏం చేయాలనే విషయంలో ట్రంప్ ఇంకా ఏ నిర్ణయం తీసుకోలేదని, అయినప్పటికీ భారీ సైనిక చర్యకు ఆదేశించే అవకాశం ఉన్నట్లు కనిపిస్తోందని సదరు అధికారులు సీఎన్ ఎన్ కు చెప్పారు. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే, ట్రంప్ గతంలోనూ ఇలాంటి సైనిక చర్యలకు మొగ్గు చూపి, చివరి క్షణంలో వెనక్కి తగ్గిన సందర్భాలు ఉన్నాయని వారు పేర్కొన్నారు. అయితే సీఎన్ ఎన్ ప్రచురించిన ఈ నివేదికపై వ్యాఖ్యానించడానికి శ్వేతసౌధం నిరాకరించింది. పెంటగాన్ కు చెందిన ఓ అధికారి దీనిపై స్పందిస్తూ, అమెరికా అధ్యక్షుడు ఆదేశించిన పని చేయడమే తమ పని పేర్కొన్నారు.

ప్రతీకార దాడులు తప్పవ్!



ఒకవేళ అమెరికా, ఇజ్రాయెల్ కలిసి మళ్లీ ఇరాన్ , యెమెన్ లోని హూతీలపై దాడులు చేస్తే, అవి కూడా తీవ్ర ప్రతీకార దాడులకు దిగవచ్చని యూఎస్ నిఘా వర్గాలు సూచిస్తున్నాయి. బహుశా పశ్చిమాసియా అంతటా, అంతకు మించి కూడా అమెరికన్ సైనికులను, సైనిక స్థావరాలను లక్ష్యం చేసుకుని ప్రతీకారం తీర్చుకునే అవకాశం ఉందని స్పష్టం చేస్తున్నాయి. "డైరెక్టర్ ఆఫ్ నేషనల్ ఇంటెలిజెన్స్ జే క్లేటన్ నుంచి యూఎస్ విదేశాంగ మంత్రి మార్కో రూబియోకు అక్టోబర్ 23న ఒక మెమో అందింది. అందులో అమెరికా సైనికులను లక్ష్యంగా చేసుకునే ప్రయత్నాలను ఇరాన్ భారీగా పెంచిందని ఉంది. పశ్చిమాసియా, కొన్ని ఇతర దేశాల్లో ఈ కుట్ర ప్రయత్నాలు పెద్ద ఎత్తున జరుగుతున్నాయని అమెరికా నిఘా వర్గాలు కనుగొన్నట్లు అందులో ఉంది. అయితే ఇరాన్ , హూతీలు మొదటిగా, అమెరికా, ఇజ్రాయెల్ సైనికులపై దాడులు చేసే అవకాశం లేదని అమెరికా నిఘా అధికారులు భావిస్తున్నారు. కానీ అమెరికా, ఇజ్రాయెల్ లు దాడులు చేస్తే మాత్రం, అవి ప్రతీకారం తీర్చుకోవడానికి వెనుకాడవని అంచనా వేస్తున్నారు" అని సీఎన్ ఎన్ తన నివేదికలో పేర్కొంది. 'ఇరాన్, హూతీల నుంచి ఎదురవుతున్న తీవ్ర ప్రతిఘటనల వల్ల ప్రాంతీయ ముప్పు ఏర్పడుతోంది. అందుకే సౌదీ అరేబియా-రియాద్ లోని అమెరికా రాయబార కార్యాలయానికి ఖాళీ చేయమని ఆదేశాలు అందాయి. రానున్న రోజుల్లో ఇతర కేంద్రాలకు కూడా ఇలాంటి ఆదేశాలు అందే అవకాశం ఉంది. ఒకవేళ అలాంటి ఆదేశాలు రాకపోయినా, సిబ్బందిని మాత్రం తగ్గించే అవకాశం ఉందని ఓ అధికారి తమకు చెప్పినట్లు' సీఎన్ ఎన్ పేర్కొంది.

దాడులకే మొగ్గు చూపుతున్న నెతన్యాహు

ఇదిలా ఉండగా, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ అమెరికాతో కలిసి ఇరాన్ పై మళ్లీ దాడులు చేయాలని భావిస్తున్నారు. కానీ ట్రంప్ ప్రభుత్వం మాత్రం కాస్త వేచిచూడమని ఆయనకు చెప్పినట్లు సీఎన్ ఎన్ తన నివేదికలో పేర్కొంది. "ఎన్నికలకు ముందే ఇరాన్ పై సంయుక్త దాడులు చేద్దామని నెతన్యాహు కోరుతున్నారు. ఇందుకోసం ట్రంప్ ను ఒప్పించడానికి కూడా ప్రయత్నించారు. కానీ ట్రంప్ పచ్చజెండా ఊపలేదు" అని ఇజ్రాయెల్ భద్రతా వర్గాలు తమకు తెలిపాయని సీఎన్ ఎన్ పేర్కొంది.

అర్ణబ్' తుపానుపై వదంతులు నమ్మొద్దు.. అప్రమత్తతో గండం నుంచి బయటపడదాం

మొదటి పేజి తరువాయి

ఈ క్రమంలో, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పందించారు. అనవసరమైన వదంతులను నమ్మవద్దని, కేవలం అధికారిక సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. భారత వాతావరణ శాఖ (×వీణ), విపత్తు నిర్వహణ శాఖ, జిల్లా యంత్రాంగం ఇచ్చే సూచనలను మాత్రమే పాటించాలని సోమవారం స్పష్టం చేశారు. ఈ విపత్కర సమయంలో ప్రజలందరూ సమన్వయంతో, ముందస్తు అప్రమత్తతతో వ్యవహరించి తుపాను గండం నుంచి సురక్షితంగా బయటపడాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మేరకు మంత్రి సోషల్ మీడియా ద్వారా ప్రజలకు సూచనలు జారీ చేశారు.

తీరం దాటేది అప్పుడే.. రెడ్ అలర్ట్ జారీ

బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం 'అర్ణబ్' తుపానుగా మారి వేగంగా బలపడుతోందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఇది అక్టోబర్ 26, సోమవారం అర్ధరాత్రికి తీవ్ర తుపానుగా, మరుసటి రోజు అక్టోబర్ 27న అతి తీవ్ర తుపానుగా మారనుందని తెలిపారు. అక్టోబర్ 28, బుధవారం ఉదయం బాపట్ల-విశాఖపట్నం మధ్య తీరం దాటే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. తీరం దాటే సమయంలో గంటకు 115 నుంచి 125 కిలోమీటర్లు, గరిష్ఠంగా 140 కిలోమీటర్ల వేగంతో ప్రచండ గాలులు వీచే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరించారు. ఈ నేపథ్యంలో అక్టోబర్ 27, 28 తేదీల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని, ఈ కారణంగా ఆంధ్రప్రదేశ్, దక్షిణ ఒడిశా తీరప్రాంతాలకు రెడ్ అలర్ట్ జారీ చేసినట్లు మంత్రి వెల్లడించారు.

ప్రాణరక్షణకే తొలి ప్రాధాన్యం

ఈ విపత్తు సమయంలో ప్రజల ప్రాణరక్షణకే తమ ప్రభుత్వం తొలి ప్రాధాన్యం ఇస్తుందని అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. తీర, లోతట్టు ప్రాంతాల ప్రజలు తక్షణమే అధికారులు సూచించిన సురక్షిత ప్రాంతాలకు, పునరావాస కేంద్రాలకు తరలివెళ్లాలని కోరారు. ప్రతి ఒక్కరూ అత్యవసర మందులు, తాగునీరు, ఆహార పొట్లాలు, టార్చ్‌లైట్లు, బ్యాటరీలు, ముఖ్యమైన పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. బలహీనమైన భవనాలు, చెట్లు, విద్యుత్ స్తంభాలు, హోర్డింగులకు దూరంగా ఉండాలని, వర్షాలు, పిడుగుల సమయంలో బయటకు రావద్దని హెచ్చరించారు. మత్స్యకారులు ఎవరూ సముద్రంలోకి వేటకు వెళ్లవద్దని, ఇప్పటికే వెళ్లినవారు వెంటనే తీరానికి చేరుకోవాలని ఆదేశించారు.

రైతన్నలకు ప్రత్యేక సూచనలు

రైతులు తమ పంటలను కాపాడుకునేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అచ్చెన్నాయుడు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. కోతకు సిద్ధంగా ఉన్న వరి, పత్తి, మొక్కజొన్న, వేరుశనగ వంటి పంటలను వాతావరణం అనుకూలించగానే కోసి, సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. ధాన్యం రాశులు, ఇతర ఉత్పత్తులను టార్పాలిన్లతో కప్పి భద్రపరచుకోవాలన్నారు. అరటి, బొప్పాయి వంటి ఉద్యాన పంటలకు ఊతంగా కర్రలు ఏర్పాటు చేసుకోవాలని, పొలాల్లో నీరు నిలిచిపోకుండా మురుగు కాలువలను సిద్ధం చేసుకోవాలని తెలిపారు. విత్తనాలు, ఎరువులు, యంత్ర పరికరాలను ఎత్తైన, సురక్షిత ప్రదేశాల్లో ఉంచాలన్నారు. అయితే, పంటలను కాపాడే ప్రయత్నంలో రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ తమ ప్రాణాలను పణంగా పెట్టవద్దని ఆయన గట్టిగా కోరారు. వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక, మత్స్యశాఖ అధికారుల సలహాలను పాటిస్తూ ఈ విపత్తును ధైర్యంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు.

ఏపీకి అర్నబ్ ముప్పు - అప్రమత్తమైన ప్రభుత్వం

మొదటి పేజి తరువాయి

వీస్తాయని వివరించారు. రేపు(మంగళవారం) కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని వెల్లడించారు. శ్రీకాకుళం, మన్యం, విజయనగరం, విశాఖ, అల్లూరి, పోలవరం, అనకాపల్లి, ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పారు. పల్నాడు, ప్రకాశం, మార్కాపురం, నెల్లూరు జిల్లాల్లో భారీ వర్షాలు కురవనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. రేపు(మంగళవారం) కోస్తా తీరం వెంబడి 90 నుంచి 100 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని అధికారులు పేర్కొన్నారు. చెట్లు, భారీ హోర్డింగ్స్, శిథిలావస్థలోని భవనాల్లో ఉండరాదని హెచ్చరించారు. ఇబ్బందులు ఉంటే ముందే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. అదేవిధంగా మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లరాదని, ఎగసిపడే అలల వద్దకు వెళ్లి సెల్ఫీలు దిగవద్దని హెచ్చరికలు జారీ చేశారు. అత్యవసర సహాయక చర్యలకు జిల్లాల్లో 7 ఎన్డీఆర్ఎఫ్, 8 ఎస్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచారు. అత్యవసర సహాయం కోసం విపత్తుల సంస్థ టోల్‌ఫ్రీ నంబర్లు 112, 1070, 1800 425 0101ను సంప్రదించాలని అధికారులు తెలియజేశారు. తుపాను దృష్ట్యా క్యాంపు కార్యాలయంలో అధికారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షకు సీఎస్, ఆర్టీజీఎస్, విపత్తు నిర్వహణశాఖల అధికారులతో పాటు వర్చువల్‌గా వివిధ శాఖల ఉన్నతాధికారులు, కలెక్టర్లు, పోలీసులు హాజరయ్యారు. తుపాను గమనం అంచనా వేసి ముందు జాగ్రత్తలు చేపట్టాలని అధికారులకు సీఎం దిశానిర్దేశం చేశారు. ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా చూడాలని సూచించారు. వర్షాలు, గాలులు, వరదలు అంచనా వేస్తూ చర్యలు చేపట్టాలని, రైతులు, ప్రజలను ఎప్పటికప్పుడు హెచ్చరించాలని సూచనలు చేశారు. తీరప్రాంతాల ప్రజలను షెల్టర్లకు తరలించాలని కలెక్టర్లను చంద్రబాబు ఆదేశించారు. అర్నబ్ తుపానుతో రాష్ట్రానికి ముప్పు పొంచి ఉందని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు హెచ్చరించారు. మంగళవారం, బుధవారం భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తీరప్రాంత ప్రజలు అవసరమైతే పునరావాస కేంద్రాలకు తరలివెళ్లాలని చెప్పారు. మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లరాదన్నారు. కోతకు సిద్ధంగా ఉన్న పంటలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, ధాన్యం, వ్యవసాయ ఉత్పత్తులు తడవకుండా టార్పాలిన్లతో కప్పి భద్రపరచుకోవాలని అన్నదాతలకు సూచించారు. పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, పశువులు, కోళ్ల షెడ్లు, వ్యవసాయ పరికరాలను సురక్షితంగా ఉంచుకోవాలని తెలిపారు. వర్షాల సమయంలో ఎరువుల వినియోగం వాయిదా వేయాలన్నారు. పంట నష్టం ఫొటోలు, వివరాలు భద్రపరచుకోవాలని సూచించారు. అదేవిధంగా వాతావరణ శాఖ, విపత్తు నిర్వహణ సంస్థ సూచనలను పాటించాలని, పంటల కంటే ప్రాణరక్షణకే తొలి ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. అప్రమత్తమైన ఆర్ అండ్‌బీ శాఖ : అర్నబ్ తుపాను ముప్పు దృష్ట్యా ఆర్అండ్‌బీ శాఖ అప్రమత్తమైంది. 'తుపాను ప్రభావం నేపథ్యంలో ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాం. జీరో క్యాజువాలిటీ లక్ష్యంగా పనిచేయాలి. రహదారులు, వంతెనల భద్రతను నిరంతరం పర్యవేక్షించాలి. చెట్లు తొలగించేందుకు ట్రీ కట్టర్లు, జేసీబీలు, పొక్లెయిన్లు సిద్ధంగా ఉంచాలి. సంబంధిత అధికారుల సెలవులు రద్దు చేస్తున్నాం. చీఫ్ ఇంజినీర్లు, ఎస్ఈలు, ఈఈలు అందుబాటులో ఉండాలి. కలెక్టర్లు పోలీసులతో సమన్వయం చేసుకుంటూ పనిచేయాలి. ప్రమాదకర వంతెనలు, కాజ్‌వేల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేయాలి. పునరావాస కేంద్రాల్లో భవనాల భద్రత, మౌలిక వసతులు నిర్ధారించాలి. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు. తుపాను ప్రభావం తగ్గే వరకు అప్రమత్తంగా ఉండాలని' అధికారులకు మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఆదేశాలిచ్చారు. తుపాను దృష్ట్యా ప్రజల తరలింపునకు జిల్లావ్యాప్తంగా 101పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు కాకినాడ కలెక్టర్ హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. తీర ప్రాంతాల్లోని 89,000ల మందికి ముందస్తు హెచ్చరికలు జారీ చేసినట్లు చెప్పారు. రేపు (మంగళవారం) మధ్యాహ్నంలోపు తీరప్రాంత ప్రజల తరలింపునకు ఆదేశాలిచినట్లు తెలిపారు ఆరు తీరప్రాంత మండలాలతో పాటు మరో 5 మండలాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు కలెక్టర్ వెల్లడించారు. 'మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లొద్దు. జిల్లాలోని 4,602 బోట్లలో 4,559 బోట్లు సురక్షిత ప్రాంతాలకు తరలించాం. మిగిలిన 43 బోట్లు పారదీప్ తదితర హార్బర్లలో సురక్షితంగా ఉన్నాయి. ఆసుపత్రులు, తాగునీటి పథకాలకు ప్రత్యామ్నాయ విద్యుత్ ఏర్పాట్లు చేశాం. విద్యుత్ అంతరాయాల పరిష్కారానికి ప్రత్యేక బృందాలు సిద్ధంగా ఉన్నాయి. రహదారులపై కూలిన చెట్ల తొలగింపునకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశాం. సహాయ చర్యలకు ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచాం. పెట్రోల్ బంకుల్లో ఇంధన నిల్వలు సమృద్ధిగా ఉంచాలని ఆదేశాలిచ్చాం. రేపు (మంగళవారం) మధ్యాహ్నం 2 నుంచి ఎల్లుండి సాయంత్రం వరకు అత్యవసరమైతేనే ప్రయాణాలు చేయాలి. 2-3 రోజులకు సరిపడా ఆహారం, తాగునీరు, మందులు సిద్ధం చేసుకోవాలి. ఈనెల 27, 28 తేదీల్లో పాఠశాలలు, కళాశాలలకు సెలవులు. అత్యవసర సహాయం కోసం జిల్లా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశాం. కంట్రోల్ రూమ్ నంబర్ల 0884-2356801, 98499 03879ను సంప్రదించాలని' కలెక్టర్ హరేంధిర ప్రసాద్ తెలియజేశారు. మరోవైపు మన్యం జిల్లాలోని 15 మండలాల్లోని తహశీల్దార్ కార్యాలయాల పరిధిలో తుపాను కంట్రోల్ రూమ్ నంబర్లను అధికారులు ఏర్పాటు చేశారు. పార్వతీపురం 83747 68252, కొమరాడ 62816 57058, సీతానగరం 94417 80526, బలిజిపేట 99484 96768, సాలూరు 73862 38564, పాచిపెంట 95508 57799 నంబర్లను సంప్రదించాలన్నారు.

క్రిమినల్స్ నడిపే పార్టీ బీజేపీ'- రాహుల్ కేసులో కోర్టు తీర్పును స్వాగతించిన కాంగ్రెస్

మొదటి పేజి తరువాయి

కించపరచాలనే ఉద్దేశంతో ఆ వ్యాఖ్యలు చేయలేదని రాహుల్ తరపున హాజరైన న్యాయవాది వాదించారు. "ఈ కేసులో రాహుల్ గాంధీ నిర్దోషిగా విడుదలయ్యారు. ఫిర్యాదుదారునికి దావా వేసేందుకు చట్టపరమైన అర్హత లేదని కోర్టు నిర్ధారించింది. రాహుల్ గాంధీ నిర్దోషిగా తేలడం పట్ల ప్రస్తుతం మా సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నాం. తీర్పు ఉత్తర్వులను పూర్తిగా పరిశీలించలేదు. ఈ కేసును కొట్టివేయడానికి గల నిర్దిష్ట కారణాలు లేదా ప్రాతిపదిక ఏమిటో, పూర్తి తీర్పు ప్రతిని చూసిన తర్వాతే చెప్పగలము" అని రాహుల్ తరపు న్యాయవాది కాశీ ప్రసాద్ శుక్లా అన్నారు. తాజాగా ఆ కేసులో విచారణ పూర్తి చేసిన సుల్తాన్‌పూర్ ప్రత్యేక కోర్టు రాహుల్ గాంధీని నిర్దోషిగా ప్రకటించింది. అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ శుభమ్ వర్మ తీర్పు వెలువరించారు. కోర్టు నిర్ణయంతో ఎనిమిదేళ్లుగా కొనసాగుతున్న ఆ కేసుకు ముగింపు లభించింది. తీర్పు వెలువడిన సమయంలో రాహుల్ గాంధీ కోర్టులోనే ఉన్నారు. అనంతరం ఆయన బయటకు రాగానే కాంగ్రెస్ కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. డప్పులు కొడుతూ, మిఠాయిలు పంచుతూ ఆనందం వ్యక్తం చేశారు. 'సత్యమేవ జయతే' అంటూ నినాదాలు చేశారు. కోర్టు తీర్పు తమ వాదనకు బలం చేకూర్చిందని కాంగ్రెస్ భావిస్తోంది. అదే సమయంలో బీజేపీపై రాజకీయ విమర్శలను మరింత గట్టిగా వినిపించింది. 2018లో కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఈ వివాదం మొదలైంది. ఆ సమయంలో బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా ఉన్న అమిత్ షాపై రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా చర్చకు దారితీశాయి. బెంగళూరులో జరిగిన మీడియా సమావేశంలో రాహుల్ మాట్లాడుతూ, హత్య కేసులో నిందితుడిగా ఉన్న వ్యక్తి బీజేపీ అధ్యక్షుడిగా ఉన్నారని వ్యాఖ్యానించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ వ్యాఖ్యలు అమిత్ షా ప్రతిష్ఠను దెబ్బతీసేలా ఉన్నాయని ఆరోపిస్తూ సుల్తాన్‌పూర్‌కు చెందిన బీజేపీ నేత విజయ్ మిశ్రా కోర్టును ఆశ్రయించారు. 2018 ఆగస్టు 4న విజయ్ మిశ్రా పరువు నష్టం ఫిర్యాదు దాఖలు చేశారు. ఆ కేసులో రాహుల్ గాంధీ 2023లో కోర్టుకు హాజరై బెయిల్ పొందారు. అనంతరం కేసు విచారణ కొనసాగింది. రాహుల్ చేసిన వ్యాఖ్యలను ఫిర్యాదుదారుడు తప్పుబట్టగా, వాటిని సందర్భం నుంచి విడదీసి చూస్తున్నారని కాంగ్రెస్ నేత తరపు న్యాయవాదులు వాదించారు.

హైదరాబాద్‌లో అమిత్ షా పాదయాత్ర.. కాంగ్రెస్ ర్యాలీకి మరుసటి రోజే బీజేపీ కౌంటర్!

నవంబర్ 1న ఢిల్లీలో కాంగ్రెస్ నిర్వహించనున్న 'ఓట్ చోరీ' వ్యతిరేక ర్యాలీకి మరుసటి రోజే హైదరాబాద్‌లో బీజేపీ పాదయాత్ర చేపట్టనుంది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా నవంబర్ 2న ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. 'లోక్‌తంత్ర బచావో - అరాజకతా హటావో' (ప్రజాస్వామ్యాన్ని కాపాడండి - అరాచకాన్ని అడ్డుకోండి) నినాదంతో ఈ యాత్ర నిర్వహించనున్నట్లు తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు వెల్లడించారు. ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్)పై కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తోందని రామచందర్‌రావు ఆరోపించారు. రాష్ట్రంలో, దేశంలో అశాంతి సృష్టించేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ ఆరోపణలకు సమాధానంగా ప్రజల్లోకి వెళ్లాలని బీజేపీ నిర్ణయించినట్లు తెలిపారు. రాష్ట్రంలో ఓటర్ల పేర్లు తొలగిస్తున్నారన్న ఆరోపణలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రామచందర్‌రావు సవాల్ విసిరారు. ముఖ్యమంత్రి స్వగ్రామం కొండారెడ్డిపల్లికి తనతో కలిసి రావాలని, అక్కడ ఓటర్ల జాబితా నుంచి ఎన్ని పేర్లు తొలగించారో పరిశీలిద్దామని

అనంత సూర్య తెలుగువార

ఎన్నికల ఫిర్యాదులను వాట్సాప్ ద్వారా తెలియజేయండి



శ్రీ సత్యసాయి జిల్లా, ప్రతినిధి అనంత సూర్య: జిల్లాలో జరుగుతున్న మున్సిపల్, జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి ప్రజలు, ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు ఎదుర్కొనే సమస్యలు, ఇబ్బందులు, ఫిర్యాదులను పోలీసు శాఖ దృష్టికి తీసుకురావాలని జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ సూచించారు. ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదుల కోసం ప్రత్యేకంగా 9515117251 వాట్సాప్ నంబర్‌ను సంప్రదించాలని ఆయన తెలిపారు.ఎన్నికల ప్రక్రియలో ఎవరైనా అభ్యర్థులను బెదిరించినా, వారిపై ఒత్తిడి తెచ్చినా, ఎన్నికలకు సంబంధించి ఇతర సమస్యలు ఎదురైనా వెంటనే ఈ వాట్సాప్ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని ఎస్పీ కోరారు.ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేలా పోలీసు శాఖ అవసరమైన చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు.ప్రజలు, ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా తమ సమస్యలను నిర్భయంగా పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. అందిన ఫిర్యాదులను పరిశీలించి, వాస్తవాల ఆధారంగా చట్టప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ స్పష్టం చేశారు.ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడేవారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని, ఎన్నికల సంబంధిత సమస్యల పరిష్కారానికి ప్రజలు పోలీసు శాఖకు సహకరించాలని జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ విజ్ఞప్తి చేశారు.

పద్మశ్రీ మందకృష్ణ మాదిగ సూచనల మేరకు గ్రామ కమిటీలను నియమాంకం

యాడికి అనంత సూర్య ప్రతినిధి అక్టోబర్ (26) : పద్మశ్రీ మందకృష్ణ మాదిగ అన్న గారి ఆదేశాల మేరకు ఎమ్మెస్పీ జాతీయ అధికార ప్రతినిధి గౌరవ–నీయులు శ్రీ డాక్టర్ వై కె విశ్వనాథ్ మాదిగ గారి సూచన మేరకు అనంతపురం జిల్లా ఇంచార్జి చిన్న సుబ్బారావు మాదిగ అన్నగారి సూచన మేరకు యాడికి మండలం తూట్రాళ్లపల్లి గ్రామంలో మీఖీగ్రామ కమిటీ నిర్మించడం జరిగింది. ఈరోజు తూట్రాళ్లపల్లి గ్రామంలో ఎంఎస్పీ మండల కన్వీనర్ లింగాల చిన్నగురప్ప మాదిగ మీఖీకమిటీలను ఏకగ్రీవంగా నిర్మాణం చేసి కమిటీ నీ ఉద్దేశించి మాట్లాడుతూ పద్మశ్రీ శ్రీ మందకృష్ణ మాదిగ అన్నగారు రాజఉపవర్గీకరణ సాధనకై మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి స్థాపించిన దినం నుంచి ఉప వర్గీకరణ సాధనే దేంగా పద్మశ్రీమందకృష్ణ మాదిగ అన్ననాయకత్వంలో చేసిన పోరాటంలో ఎంతోమంది మాదిగలు వర్గీకరణ పోరాటంలోప్రాణాలర్పించి మాదిగ అమరవీరుల త్యాగాలు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ అన్న గారి కుటుంబ త్యాగము అన్నగారు విరామం లేని వెనుచూపుని పోరాటంతో ఉప వర్గీకరణ సాధించుకోవడం జరిగినది 32 సంవత్సరాలు మాదిగ జాతి తన కుటుంబం అనుకొని కులం



పేరు చెప్పుకోలేని స్థితి నుంచి నేను మాదిగను అని చెప్పుకునే స్థాయికి మన జాతి ఆత్మ గౌరవాన్ని మన జాతికే ఆత్మగౌరవం తెచ్చిపెట్టడమే కాకుండా భారత దేశంలో మాదిగ అనే పేరు వినిపించే విధంగా మాదిగ జాతిని ఉన్నత శిఖరాలకు చేర్చినమహానాయకుని నాయకత్వంలోమీఖీ కమిటీలో చేరిన మీరు మహా నాయకుడు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ అన్నగారు పవర్గీకరణ సాధన కోసం 32 సంవత్సరాలు నిరంతరం చేసిన పోరాటాలను మీరు స్ఫూర్తిగా తీసుకొని మీరు ఉద్యోగాలు పొందే అంతవరకు మహా నాయకుడు సాధించిన ఎస్సీ వర్గీకరణ, పోరాటాలను వివరిస్తూ చదువుపై అవగాహన కల్పిస్తూ పతి మాదిగ బిడ్డ ఉప వర్గీకరణ ఫలాలు పొందే విధంగా మీ వంతుగా అవగాహన కల్పించాలని తెలియజేయడం జరిగింది గ్రామాల మీఖీకమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది ఈ కార్యక్రమంలో ఎంఎస్పీ మండల కన్వీనర్ లింగాల చిన్న గుర్రప్ప మాదిగ ఇంటర్ డిగ్రీ చదువుతున్నమాదిగ విద్యార్థులు ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు

అజేష్ గెలిస్తే.. త్రిబుల్ ఇంజన్ సర్కార్, సమగ్రమైన అభివృద్ధి

- సినీనటుడు, బీజేపీ నేత సాయికుమార్ ప్రజలకు పిలుపు
- అర్బన్ టీడీపీ కార్యాలయానికి వచ్చిన సాయికుమార్
- ఎన్నికలపై ఎమ్మెల్యే దగ్గుపాటి, మంత్రి సత్యకుమార్ తో కలిసి చర్చలు
- గొడ్డలి పార్టీ పాలనకు, మా పాలనకు తేడా గమనించాలన్న దగ్గుపాటి

అనంతపురం, అక్టోబర్ 26 అనంత సూర్య : అనంతపురం నగరంలో బిజెపి మేయర్ అభ్యర్థి అజేష్‌ను గెలిపిస్తే.. ఇక్కడ త్రిబుల్ ఇంజన్ సర్కార్ తో.. అభివృద్ధి వేగవంతమవుతుందని సినీనటుడు, బిజెపి సీనియర్ నాయకుడు సాయికుమార్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన సోమవారం ఉదయం అనంతపురం అర్బన్ తెలుగుదేశం పార్టీ కార్యాలయానికి వచ్చారు. సాయికుమార్‌కు అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, ఎమ్మెల్సీ దళవాయి రమాదేవి, కూటమి నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రి సత్యకుమార్, దగ్గుపాటితో కలిసి టిడిపి క్లస్టర్ ఇంచార్జ్ లు, నాయకులతో సమావేశం నిర్వహించారు. మేయర్ అభ్యర్థి అజేష్ తో పాటు 62 డివిజన్లలోని కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా, ఎన్నికల్లో ఎలా ముందుకు వెళ్లాలనే వ్యూహాలపై టీడీపి, బీజేపీ నేతలతో కలిసి



వారు సుదీర్ఘంగా సమాలోచనలు జరిపారు. ఈ సందర్భంగా సాయికుమార్ మీడియాతో మాట్లాడుతూ.. తనకు అనంతపురం జిల్లాతో చాలా ఏళ్ల క్రితం నుంచే విడదీయరాని అనుబంధం ఉందన్నారు. పుట్టపర్తి శ్రీ సత్యసాయి బాబా తాగునీటి పథకాన్ని అప్పట్లో ప్రకటించింది తానేనని ఈ సందర్భంగా గుర్తు చేశారు. చిన్ననాటి నుంచే దేశభక్తి భావాలు కలిగిన తాను 2003లో అధికారికంగా బీజేపీలో చేరానన్నారు. గతంలో అనంతపురం జిల్లాతో పాటు ఏపీలోని వివిధ జిల్లాల్లో, దేశంలోని పలు రాష్ట్రాల్లో బీజేపీ తరఫున విస్తృతంగా ప్రచారం చేసి మంచి విజయాలు సాధించామన్నారు. అనంతపురం జిల్లా ప్రజలు మాట ఇస్తే దానికి కట్టుబడి ఉంటారన్న ఆయన, రాజకీయ నాయకుల్లో మార్పు రావాలంటే ప్రజలు కూడా 'ఏమిస్తారని కాదు.. ఏం చేస్తారని' అడగాలన్నారు. తామిచ్చిన హామీలను నెరవేర్చాలని నాయకులను నిలదీసే చైతన్యం చూపాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం కేంద్రంతో పాటు రాష్ట్రంలో కూటమి ఆధ్వర్యంలో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వేగంగా సాగుతున్నాయని, అనంతపురం నగరంలో ఈ ప్రగతి మరింత వేగవంతం కావాలంటే బీజేపీ మేయర్ అభ్యర్థి అజేష్ ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఇక్కడ అజేష్ గెలిస్తే నగరానికి 'త్రిబుల్ ఇంజన్ సర్కార' వస్తుందని.. తద్వారా నియోజకవర్గ రూపురేఖలు మారిపోతాయని సాయికుమార్ అన్నారు. అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ.. నగరంలో అజేష్ గెలిచాడంటే అనంతపురం అభివృద్ధిపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రత్యేక చూపు ఉంటుందన్నారు. గత ఐదేళ్ల కాలంలో 'గొడ్డలి పార్టీ' చేసిన అరాచకాలు, విధ్వంసాన్ని ఒకసారి స్మరించుకోవాలని, అదే సమయంలో ఈ రెండేళ్ల కూటమి పాలనలో జరిగిన ప్రగతిని చూసి ప్రజలు ఓటు వేయాలని కోరారు. వైసిపికి వేసే ప్రతి ఓటూ మునిగిపోవడానికి తప్ప అభివృద్ధికి ఎంతమాత్రం ఉపయోగపడదన్నారు. ప్రజలు తమ ఓటును వృథా చేసుకోవద్దని హితవు పలికారు. నగర సమగ్ర వికాసం కోసం మేయర్ అభ్యర్థి అజేష్‌తో పాటు 62 డివిజన్లలో పోటీ చేస్తున్న కూటమి అభ్యర్థులందరినీ అత్యధిక మెజారిటీతో గెలిపించి తిరుగులేని విజయాన్ని అందించాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ప్రజలను కోరారు.

నగర సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతాం - వైసీపీ మేయర్ అభ్యర్థి సి.రమేష్ గౌడ్

అనంతపురం, అక్టోబర్ 26 అనంత సూర్య : అనంతపురం నగరపాలక సంస్థ ఎన్నికల నేపథ్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రచారం ముమ్మరమైంది. వైసీపీ మేయర్ అభ్యర్థి సి.రమేష్ గౌడ్, నగర సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామని పేర్కొంటూ, ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ప్రజలను కోరారు. అనంతపురం నగరంలోని 22, 23వ డివిజన్లలో మేయర్ అభ్యర్థి సి.రమేష్ గౌడ్, 22వ డివిజన్ కార్పొరేటర్ వైసీపీ అభ్యర్థి ఐశ్వర్య గోవింద రెడ్డి, 23వ డివిజన్ కార్పొరేటర్ వైసీపీ అభ్యర్థి వీరే చంద్రశేఖర్ బాబులతో కలిసి ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు. ఓటర్లను కలిసి, వైసీపీ అభ్యర్థులకు మద్దతుగా ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వైసీపీ మేయర్ అభ్యర్థి రమేష్ గౌడ్ మాట్లాడుతూ.. అనంతపురం నగర ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమిస్తూ నగరాభివృద్ధికి పనిచేస్తామని తెలిపారు. వైసీపీ అభ్యర్థుల గెలుపుతోనే నగరాభివృద్ధి సాధ్యమవుతుందని రమేష్ గౌడ్ తెలియజేశారు. ప్రచారంలో మాజీ ఎమ్మెల్యే, వైసీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ కొగటం విజయ భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు. అలాగే చవ్వా రాజశేఖర్ రెడ్డి, నదీమ్, వెన్నపూస రవీంద్రారెడ్డి, వైవీ శివారెడ్డి, ప్రియాంక అనుదీప్ తదితర పార్టీ నాయకులు ప్రజలతో కలిసి ప్రచారం చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు విడివిడిగా వార్డుల్లోకి వెళ్లి, వైసీపీ విధానాలను వివరిస్తూ ఓటర్ల మద్దతు కోరుతున్నారు. అనంతపురం నగరపాలక సంస్థ ఎన్నికలలో మేయర్ అభ్యర్థి రమేష్ గౌడ్‌తో



పాటు, వివిధ డివిజన్లలో పోటీ చేస్తున్న వైసీపీ కార్పొరేటర్ అభ్యర్థుల గెలుపు కోసం ప్రచారం కొనసాగిస్తున్నారు. ప్రచారంలో భాగంగా రమేష్ గౌడ్ ఇప్పటికే నగరంలోని పలు డివిజన్లను సందర్శించి, స్థానికులు, మైనార్టీ మతపెద్దలతో సమావేశమై మద్దతు కోరారు. మేయర్‌గా ఎన్నికైతే ప్రజలకు అందుబాటులో ఉంటూ, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమిస్తానని ఆయన ప్రకటించారు.

యాడికి మండలంలో ఎన్నికల వేడి.. సై అంటే సై అంటున్న ఇరువర్గాలు!

యాడికి అనంత సూర్య ప్రతినిధి అక్టోబర్(26) : యాడికి: యాడికి మండలంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నేపథ్యంలో రాజకీయ వేడి రోజురోజుకూ పెరుగుతోంది. ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు సై అంటే సై అంటూ ఎన్నికల బరిలో నిలిచేందుకు సిద్ధమవుతున్నారు. నామినేషన్ల ప్రక్రియ ముగియడంతో పాటు నామినేషన్ల పరిశీలన పూర్తికావడంతో, చెల్లుబాటైన అభ్యర్థులు ఎన్నికల పోరుకు సన్నద్ధమవుతున్నారు. మండలంలోని వివిధ ఎంపీటీసీ స్థానాల్లో ప్రధాన పార్టీల అభ్యర్థులు తమ విజయావకాశాలపై అంచనాలు వేసుకుంటూ, ఓటర్ల మద్దతు కూడగట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. ఒకవైపు అధికార పార్టీ అభ్యర్థులు, మరోవైపు ప్రతిపక్ష పార్టీ అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. ఇప్పటికే అభ్యర్థుల ఎంపిక, నామినేషన్ల ప్రక్రియతో ఆసక్తికరంగా మారిన రాజకీయ వాతావరణం, రానున్న రోజుల్లో మరింత వేడెక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి. యాడికి మండలంలో ఏ పార్టీ అభ్యర్థులు పైచేయి సాధిస్తారు? ప్రజలు ఎవరికి పట్టం కడతారు? అన్నది ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చగా మారింది.

యాడికిలో ఎన్నికల విధులపై ఉపాధ్యాయులకు శిక్షణ



యాడికి అనంత సూర్య ప్రతినిధి అక్టోబర్(26) : యాడికి మండలంలో రానున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఉపాధ్యాయులకు ఎన్నికల విధులపై శిక్షణ కార్యక్రమాన్ని ఎంపీడీవో వీర్రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో ఎన్నికల విధులు నిర్వహించే ఉపాధ్యాయులకు ఎన్నికల ప్రక్రియ, పోలింగ్ నిర్వహణ, ఎన్నికల నియమ నిబంధనలు, పోలింగ్ కేంద్రాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఎన్నికల సమయంలో ప్రతి ఒక్కరూ తమకు కేటాయించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా ఎన్నికల సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని, ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఎన్నికల విధుల్లో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా, తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని ఉపాధ్యాయులకు వివరించారు. ఎన్నికలు సజావుగా జరిగేలా సిబ్బందిని సన్నద్ధం చేయడమే లక్ష్యంగా ఎంపీడీవో వీర్రాజు ఆధ్వర్యంలో ఈ శిక్షణ సమావేశం నిర్వహించారు.

సిపిఐ కార్యదర్శి చిరంజీవి యాదవ్ ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం

యాడికి అంత సూర్య ప్రతినిధి అక్టోబర్(26) : తాడిపత్రి పట్టణంలో భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఎం,ూ= పార్టీలు బలపరిచిన తాడిపత్రి 11వ వార్డు, కౌన్సిలర్ గా సిపిఐ అభ్యర్థి గడ్డం, కృష్ణవేణి గారు, 11 వార్డు లో తాడిపత్రి పట్టణ సిపిఐ కార్యదర్శి చిరంజీవి యాదవ్ ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం చేస్తూ 11వ వార్డు కౌన్సిలర్ గా సిపిఐ పార్టీ గుర్తు కంకి కొడవలి, తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ గా వైయస్సార్ పార్టీ అభ్యర్థి ఎ, ఫయాజ్ భాషా గారి గుర్తు ఫ్యాను గుర్తు కు మీ అమూల్యమైన ఓటు ఒక ఓటు ఫ్యాన్ గుర్తుకి, మరో ఓటు కంకి కొడవలి గుర్తుకు వేసి వేయించి గెలిపించాలని ఇంటింటా ప్రచారం చేయడం జరిగినది. ఈ ఇంటింటి ప్రచారంలో సిపిఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు, ణ, పెద్దయ్య, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి, నరసింహులు, పట్టణ సహాయ కార్యదర్శి శ్రీరాములు, రమణ, అబ్రహం, రత్నమయ్య, మహిళ పట్టణ కార్యదర్శి సావిత్రమ్మ, పెద్దవడుగూరు మండలం సిపిఐ నాయకులు, హుస్సేన్ పీరా, రంగనాయకులు, శ్రీనివాసులు రెడ్డి,నాగేంద్ర పూల రంగస్వామి, అల్లా ప్రకాష్, శేషు గౌడు, రామాంజనేయులు, మహిళలు సిపిఐ పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు..

యాడికి మండలంలో వాల్మీకి సోదరులు ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు నిర్వహించారు



యాడికి: యాడికి మండల వ్యాప్తంగా వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి మహర్షికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తిశ్రద్ధలతో జయంతి వేడుకలు జరుపుకున్నారు. జయంతి వేడుకల్లో భాగంగా భక్తులకు అన్నప్రసాద వితరణ, భోజనాల కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజలు, వాల్మీకి సంఘం నాయకులు, యువకులు, భక్తులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. వాల్మీకి మహర్షి ఆశయాలను స్మరించుకుంటూ ఆయన బోధించిన మార్గంలో నడవాలని పలువురు ఆకాంక్షించారు. ఈ వేడుకలతో యాడికి మండలంలో పండుగ వాతావరణం నెలకొంది. గమనిక: గ్రామం పేరు, ముఖ్య అతిథులు, కార్యక్రమంలో పాల్గొన్న నాయకుల పేర్లు తెలియజేస్తే వార్తను మరింత వివరంగా, పత్రికలో ప్రచురించడానికి అనువుగా తయారు చేస్తాను.

చరణ్ పౌర్ణమి సందర్భంగా యాడికి పెద్దమ్మ తల్లికి ప్రత్యేక పూజ కార్యక్రమం



యాడికి అనంత సూర్య ప్రతినిధి అక్టోబర్(26) : యాడికి శ్రీశ్రీశ్రీ పెద్దమ్మ తల్లికి శరణ్ పౌర్ణమి సందర్భంగా పెద్దమ్మ తల్లి ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పూజా కార్యక్రమాలు నిర్వహించారు ఉదయం సుప్రభాత సేవ గంగా పూజ పంచామృతాభిషేకము నూతన వస్త్రాల సమర్పణ టెంకాయ పట్టలతో అరటి పిలకలచే మామిడి ఆకులతో వేప కొమ్మలతో పెద్దమ్మతల్లిని ఆలయాన్ని సుందరంగా అలంకరించి కుంకుమార్చనలు లలితా సహస్రనామావళి మణిద్వీప వర్ణన భక్తి పాటలచే భజన కార్యక్రమం ఖడ్గమాల మొదలైన కార్యక్రమాలన్నీ నిర్వహించి భక్తాదులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు జై పెద్దమ్మ తల్లి జై జై పెద్దమ్మ తల్లి అంటూ ఆలయ ప్రాంగణమంతా మారు మోగింది

హోరెత్తిన కూటమి ఎన్నికల ప్రచారం

ప్రత్యేక ఆకర్షణగా సినీ హీరో సాయికుమార్ - 56, 59వ డివిజన్లలో రోడ్ షో, ప్రచారం





అనంతపురం, అక్టోబర్ 26 అనంత సూర్య :

అనంతపురం నగరం కూటమి నేతల ప్రచారంతో హోరెత్తింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా కూటమి ఆధ్వర్యంలో సోమవారం నగరంలోని పలు డివిజన్లలో ముమ్మరంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహించారు. ఈ ప్రచారంలో ప్రముఖ సినీ నటుడు, బీజేపీ సీనియర్ నేత సాయికుమార్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు టీసీ వరుణ్, కూటమి మేయర్ అభ్యర్థి అజేష్ బాబు సంయుక్తంగా పాల్గొన్నారు. 56 డివిజన్ టీడీపీ అభ్యర్థి గంగన లక్ష్మీరెడ్డి, 59వ డివిజన్ టీడీపీ అభ్యర్థి కంఠా రాయల్ మురళి తరపున విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. సినీ నటుడు సాయికుమార్ స్థానికులను విశేషంగా ఆకట్టుకున్నారు. అజేష్ బాబు పేరులోనే కర్తవ్యం ఉందని, ఆయనను గెలిపించడం మన బాధ్యతన్నారు. 1983 నుంచి తాను దేశమంతా తిరుగుతున్నానని, ఇవాళ ప్రపంచవ్యాప్తంగా ఇండియా పేరు మారు మ్రోగుతోందని, విదేశాల్లో ఇండియా అంటే మోడీ అంటున్నారని ప్రశంసించారు. తనకు మతం గితం లేదని, దేశం కోసం పనిచేసే మోడీకి ముస్లిం సోదరుల మద్దతు కూడా పూర్తిగా ఉందన్నారు. గతంలో బెంగాల్‌తో పాటు నందిగామలోనూ కూటమి గెలుపునకు ముస్లింలే కారణమయ్యారని గుర్తు చేశారు. తన జీవితానికి, 'పోలీస్ స్టోరీ' సినిమాకు మెగాస్టార్ చిరంజీవి బ్లెస్సింగ్స్ ఇచ్చారని.. పవన్ కళ్యాణ్ ఆప్యాయత ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. కేంద్రంలో మోడీ, రాష్ట్రంలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం, ఇక్కడ నగరంలో మన అజేష్ మేయర్ అయితే 'త్రిబుల్ ఇంజన్ సర్కార్' పవర్‌తో అనంతపురానికి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సిస్టమ్‌తో పాటు, నగర సమీపంలోకి ఎయిర్‌పోర్ట్ కూడా తీసుకొస్తామన్నారు. బీజేపీ మేయర్ అభ్యర్థి అజేష్ బాబు ఒక సామాన్య కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తి అని.. ఆయనను మీరు అత్యధిక మెజారిటీతో గెలిపిస్తే కేంద్రం నుంచి, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నుంచి నగరానికి ప్రత్యేక నిధులు వస్తాయన్నారు. 62 డివిజన్లలో కూటమి అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. ప్రచారంలో టీడీపీ ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, మాజీ మేయర్ మదమంచి స్వరూప, అర్బన్ బ్యాంక్ చైర్మన్ జేఎల్ మురళీధర్, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ గౌస్ మోదిన్, రాష్ట్ర ముతవల్లీల సంఘం అధ్యక్షులు కేయం షకీల్ షఫీ, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ కేవీం హర్షద్, లింగాయత్ కార్పొరేషన్ చైర్మన్ స్వప్న, డైరెక్టర్ చల్ల లక్ష్మీప్రసాద్, క్లస్టర్ ఇంచార్జ్ వన్నూర్, కూచి హరిప్రసాద్, 59వ డివిజన్ ఎలక్షన్ ఇన్‌చార్జ్ యాట వెంకట సుబ్బన్న, కూడేరు మండల పార్టీ అధ్యక్షుడు బోయమురళి, జైన్, తాజుద్దీన్, మున్వర్, డిష్ ప్రకాష్, జిల్లా ఉపాధ్యక్షులు బోయ కృష్ణ కుమార్, టౌన్ బ్యాంక్ డైరెక్టర్ చింతా భాస్కర్, వడ్డే లోకనాథ్, శేఖర్ నాయుడు, జయనారాయణ, రాజేష్, లాయర్ మనోజ్, విష్ణు, కిరణ్, దిలీప్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రాఘవేంద్రుడిని దర్శించుకున్న సినీ హీరో సాయికుమార్



అనంతపురం, అక్టోబర్ 26 అనంత సూర్య :

నగరంలోని మొదటిరోడ్డులో గల రాఘవేంద్రస్వామి దేవాలయంలో స్వామివారిని సినీ హీరో, బీజేపీ నాయకులు సాయికుమార్ దర్శించుకున్నారు. ఆయనతోపాటు మంత్రి సత్యకుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో అహుడా చైర్మన్ టీసీ వరుణ్, 55వ డివిజన్ బీజేపీ అభ్యర్థి ఈశ్వర ప్రసాద్, ఆంధ్రప్రదేశ్ వీరశైవ లింగాయత్, లింగ బలిజ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ తుల్జాపూర్ స్వప్న, కూటమి నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాయి కుమార్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రెండున్నర సంవత్సరంలో ఆంధ్ర రాష్ట్రంలో ఎటు చూసినా సంక్షేమం, అభివృద్ధి కనిపిస్తోందన్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీ మేయర్ అభ్యర్థి అజేష్ యాదవ్‌తోపాటు 62 డివిజన్లలోనూ కూటమి అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరారు.

జానకమ్మ ప్రచార జోరు.. ప్రత్యర్థులు బేజారు !

46వ డివిజన్‌లో ఊపందుకున్న సైకిల్ హోరు




అనంతపురం, అక్టోబర్ 26 అనంత సూర్య :

అనంతపురం నగరపాలక సంస్థ ఎన్నికల నేపథ్యంలో 46వ డివిజన్‌లో సైకిల్ స్పీడు ఊపందుకుంది. ఇంటింటా ప్రచారం చేపట్టిన టీడీపీ అభ్యర్థి జానకమ్మ జోరందుకుంది. ప్రతి గడపలోనూ ఆప్యాయతతో పలుకరిస్తూ.. ఈసారి ఎన్నికల్లో నీకే మా ఓటు అంటూ డివిజన్ ప్రజలు దీవిస్తున్నారు. అనంతపురం నగరం అభివృద్ధి చెందాలంటే.. ఎన్డీయే ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందన్నారు. నగర సుందరీకరణ కూటమితోనే జరుగుతుందన్నారు. ఈ రెండున్నరేళ్లలో ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చూసి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. కావున భారతీయ జనతా పార్టీ మేయర్ అభ్యర్థి అజేష్ యాదవ్ కమలం గుర్తుతో పాటు తన గుర్తు సైకిల్ గుర్తుకు ఓటెయ్యాలని ఓటర్లను అభ్యర్థించారు. మీ ఇంటి ఆడబిడ్డగా తనను దీవించాలని డివిజన్ ప్రజలను కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కురుబ రాజా, హేమంత్, మంజునాథ్, సుమతి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

పారపాటు చేయొద్దు.. దౌర్జన్యపరులకు అవకాశం ఇవ్వద్దు

- అనంతపురంలో రెండున్నరేళ్ల పాలనను గుర్తుకు తెచ్చుకోండి
- కూటమి అభ్యర్థులకు ఓటేస్తే మళ్లీ భూకబ్జాలు, దోపిడీ పాలనే
- వైఎస్ఆర్‌సీపీకి పట్టం కట్టి అనంతపురాన్ని అభివృద్ధి చేసుకుందాం
- ఎన్నికల ప్రచారంలో వైసీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి మేయర్ అభ్యర్థి రమేష్ గౌడ్‌తో కలిసి 46, 47, 48వ డివిజన్లలో ప్రచారం



అనంతపురం, అక్టోబర్ 26 అనంత సూర్య :

కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక అనంతపురం నగరంలో రెండున్నరేళ్లుగా భూదందాలు, దౌర్జన్యాలు ఎక్కువయ్యాయని వైసీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. కార్పొరేషన్ ఎన్నికల్లో ప్రజలు పొరపాటున కూటమి అభ్యర్థులను గెలిపిస్తే మళ్లీ దౌర్జన్యపరులకు అవకాశం ఇచ్చినట్టు అవుతుందని అన్నారు. సోమవారం సాయంత్రం నగరంలోని 46, 47, 48వ డివిజన్లలో మేయర్ అభ్యర్థి రమేష్‌గౌడ్‌తో కలిసి ఆయా డివిజన్ల కార్పొరేటర్ అభ్యర్థులు చింతకుంట మధు, ఖాజావలి, శ్రీనివాసరెడ్డిలకు మద్దతుగా ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి వైసీపీ హయాంలో జరిగిన మంచిని వివరించారు. ఈ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ కూటమి పాలనలో కార్పొరేషన్లు, మునిసిపాలిటీలు అవినీతి, అక్రమాలకు నిలయంగా మారిపోయాయని విమర్శించారు. ప్రజాప్రతినిధులు ప్రజల సంక్షేమాన్ని గాలికి వదిలేసి తమ వ్యక్తిగత ఆదాయం కోసం పరితపిస్తున్నారని దుయ్యబట్టారు. ఎక్కడా చూసినా మద్యం దందా కొనసాగుతోందని, అనంతపురంలో గంజాయి కూడా విచ్చలవిడిగా లభిస్తున్న పరిస్థితి ఉందన్నారు. కూటమి పార్టీలకు బుద్ధి చెప్పే అవకాశం ప్రజలకు వచ్చిందని, కార్పొరేషన్ ఎన్నికల్లో వైసీపీకి ఓటు వేయాలని కోరారు. జిల్లా కేంద్రమైన అనంతపురం నగరంలో దోపిడీ, భూ ఆక్రమణలు, డబుల్ రిజిస్ట్రేషన్లు కొనసాగుతున్నాయని.. సామాన్య ప్రజల ఆస్తులకు రక్షణ లేకుండాపోయిందని తెలిపారు. రెండున్నరేళ్లుగా భూకబ్జాలు, దందాలు చేసిన వారి కుటుంబ సభ్యులే ఈ రోజు కార్పొరేటర్ అభ్యర్థులుగా పోటీ చేస్తున్నారని తెలిపారు. బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీ అభ్యర్థులకు ఓటు వేస్తే అవినీతికి తావిచ్చినట్టేనని అన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో అనంతపురంలో రూ.1200 కోట్లతో అభివృద్ధి పనులు చేశామని గుర్తు చేశారు. మళ్లీ ఈ నగరం అభివృద్ధి పథంలోకి వెళ్లాలంటే మేయర్ అభ్యర్థిగా రమేష్‌గౌడ్‌ను, కార్పొరేటర్లుగా వైసీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ ఎన్నికల్లో జెన్‌జీ యువతకు పెద్ద ఎత్తున అవకాశాలు ఇచ్చామని, వారందరినీ ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే అనంతపురం నగర ప్రజలకు తాము కాపలా దారులుగా ఉంటామని భరోసా ఇచ్చారు.



ఐఓక్యూఎంలో 18 మంది విద్యార్థుల ఎంపికతో

శ్రీచైతన్య ప్రభంజనం



అనంతపురం, అక్టోబర్ 26 అనంత సూర్య :

జాతీయ స్థాయిలో నిర్వహించిన ఇండియన్ ఒలింపియాడ్ క్వాలిఫయర్ ఇన్ మ్యాథమెటిక్స్ (ఐఓక్యూఎం) 2026 మొదటి దశ పరీక్షలో శ్రీ చైతన్య ఏటీపీ 5 ఐపీఎల్, కో ఐపీఎల్ క్యాంపస్‌కు చెందిన 18 మంది విద్యార్థులు ఎంపికై అద్భుత విజయాన్ని సాధించారు. ఈ ఘనతతో విద్యార్థులు పాఠశాలకు గర్వకారణంగా నిలిచి, తమ గణిత ప్రతిభను జాతీయ స్థాయిలో చాటుకున్నారు. ఐఓక్యూఎం 2026 మొదటి దశలో ఎంపికైన ఈ 18 మంది విద్యార్థులు నవంబర్‌లో జరగనున్న ఆర్ఎంఓ పరీక్షకు అర్హత సాధించారు. ఈ విజయం విద్యార్థుల ప్రతిభకు, ఉపాధ్యాయుల కృషికి, పాఠశాల యాజమాన్యం అందిస్తున్న ప్రోత్సాహానికి నిదర్శనంగా నిలిచింది. ఈ విజయాన్ని పురస్కరించుకుని పాఠశాలలో ప్రత్యేక అభినందన సభను ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి శ్రీ చైతన్య విద్యాసంస్థల అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల ఏజీఎం సుబ్బారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐఓక్యూఎం 2026 మొదటి దశలో ఎంపికైన 18 మంది విద్యార్థులను అభినందించి, వారి విజయాన్ని ప్రశంసించారు. విద్యార్థులు ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో మరిన్ని జాతీయస్థాయి విజయాలు సాధించి, పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థుల ఈ విజయానికి ఉపాధ్యాయుల కృషి, తల్లిదండ్రుల ప్రోత్సాహం, యాజమాన్యం అందిస్తున్న సహకారం ఎంతో దోహదపడ్డాయని పాఠశాల ప్రతినిధులు పేర్కొన్నారు. 18 మంది విద్యార్థులు ఎంపిక కావడం పాఠశాల విద్యా ప్రమాణాలకు, నాణ్యమైన బోధనకు నిదర్శనంగా నిలిచింది. కార్యక్రమంలో రీజినల్ ఇన్‌చార్జి సమీన ఖాన్, ప్రిన్సిపాల్స్ నరేష్ కుమార్, విశ్వనాథ్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీరాములు, కోఆర్డినేటర్ రాధాకృష్ణ నాయుడు, కో ఐపీఎల్ ఇన్‌చార్జి శ్రీనివాస్ పట్నాయక్, ఐపీఎల్ ఇన్‌చార్జి జయచంద్ర, ఏఓ/టీ హరినాథ్ రెడ్డి, నాగరాజు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



వైసీపీ అభ్యర్థి షెక్షాను ఆశీర్వదించండి..

1వ డివిజన్ ప్రచారంలో మేయర్ అభ్యర్థి భార్య కరుణ

సాయి రాకతో యువతలో ఉరకలెత్తిన ఉత్సాహం

ప్రతి గడపలోనూ బ్రహ్మరథం

అనంతపురం, అక్టోబర్ 26 అనంత సూర్య :

అనంతపురం నగరపాలక సంస్థ ఎన్నికల నేపథ్యంలో 1వ డివిజన్‌లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి షెక్షావలిని ఆశీర్వదించాలని ఆ పార్టీ మేయర్ అభ్యర్థి సి.రమేష్ గౌడ్ భార్య కరుణ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారానికి మాజీ మేయర్ వసీం, వేముల నదీం, జిల్లా మహిళా అధ్యక్షురాలు శ్రీదేవి రెడ్డి, లీగల్ సెల్ నీరజ తదితరులు హాజరయ్యారు. ఇదిలా ఉండగా.. ఇటీవల జనసేన నుంచి వైసీపీలోకి చేరిన సాయికృష్ణ యాదవ్ ప్రచారంలో పాల్గొనడంతో యువత పెద్ద ఎత్తున ఆహ్వానిస్తూ.. ఉరకెత్తిన ఉత్సాహంతో రెట్టింపు ప్రచారం చేపట్టారు. మేయర్ అభ్యర్థి భార్య కరుణకు ప్రతి గడపలోనూ బ్రహ్మరథం పట్టారు. ఈసారి ఎన్నికల్లో తప్పకుండా ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని అభ్యర్థించడంతో రెండు ఓట్లు ఫ్యాన్‌కే వేసి మేయర్, కార్పొరేటర్ అభ్యర్థులకు తప్పకుండా అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని డివిజన్ ప్రజలు భరోసా ఇచ్చారు. అనంతపురం నగరం అభివృద్ధి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని కరుణ పేర్కొన్నారు. ప్రచారంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువత పాల్గొన్నారు.



4వ డివిజన్లలో దూసుకుపోతున్న వైసీపీ

వైసీపీ మేయర్ అభ్యర్థి రమేష్ గౌడ్ భార్య, మాజీ మేయర్ వసీం ప్రచారం

అనంతపురం, అక్టోబర్ 26 అనంత సూర్య :

అనంతపురం నగరపాలక సంస్థ ఎన్నికల నేపథ్యంలో 4వ డివిజన్‌లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ప్రణతి ప్రచారంలో దూసుకుపోతున్నారు. సోమవారం జరిగిన వైసీపీ ప్రచారంలో ఆ పార్టీ మేయర్ అభ్యర్థి సి.రమేష్ గౌడ్ భార్య కరుణ, మాజీ మేయర్ వసీం, వేముల నదీం, జిల్లా మహిళా అధ్యక్షురాలు బిందెల శ్రీదేవి రెడ్డి, లీగల్ సెల్ నీరజ తదితరులు పాల్గొన్నారు. అభ్యర్థి ప్రణతి తోపాటు మేయర్ అభ్యర్థి భార్య కరుణ ప్రతి ఇంటికీ వెళ్లి ఈసారి ఎన్నికల్లో రెండు ఓట్లు ఫ్యాన్‌కు వేయాలని ప్రజలను అభ్యర్థించారు. అనంత నగరాభివృద్ధి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీతోనే సాధ్య మవుతుందని పేర్కొన్నారు. గతంలో ప్రతి గడప వద్దకు అభివృద్ధి, సంక్షేమం వెళ్లిందన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రెండున్నరేళ్లలో అరాచకాలు, అవినీతి, దౌర్జన్యాలు, కబ్జాలు పెట్రేగిపోయా యన్నారు. నగరంలో ప్రశాంత వాతావరణం ఉండాలంటే కార్పొ రేషన్ ఎన్నికల్లో మేయర్ అభ్యర్థి అయిన తన భర్త సి.రమేష్‌గౌడ్ తోపాటు వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో వార్డు మైనార్టీ అధ్యక్షులు ఫకృద్దీన్, యువ నాయకులు సాయికృష్ణ యాదవ్, మైనుద్దీన్, ఖాజామొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



మహర్షి వాల్మీకి ఆశయాలు

సమాజానికి స్ఫూర్తిదాయకం

అనంతపురం, అక్టోబర్ 26 అనంత సూర్య :



ఆదికవి మహర్షి వాల్మీకి జయంతి సందర్భంగా బీసీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో మహర్షి వాల్మీకి సేవలను స్మరించుకుంటూ ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీసీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి అధ్యక్షుడు సాకే నరేష్ మాట్లాడుతూ.. మహర్షి వాల్మీకి భారతీయ సాహిత్య చరిత్రలో ఆదికవిగా విశిష్ట స్థానం సంపాదించారని, ఆయన రచించిన రామాయణం ధర్మం, న్యాయం, సత్యం, త్యాగం, మానవతా విలువలను తరతరాలకు అందిస్తోందని పేర్కొన్నారు. మహర్షి వాల్మీకి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజంలో విద్య, సమానత్వం, సామాజిక ఐక్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన పిలుపునిచ్చారు. ముఖ్యంగా వెనుకబడిన వర్గాల విద్యా, సామాజిక, ఆర్థిక అభివృద్ధికి కృషి చేయాలని, యువత ఉన్నత విద్యను అభ్యసించి వివిధ రంగాల్లో రాణించేలా ప్రోత్సహించాలన్నారు. బీసీ వర్గాలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, రిజర్వేషన్ల పరిరక్షణతో పాటు విద్య, ఉపాధి, రాజకీయ రంగాల్లో సముచిత అవకాశాల సాధనకు ప్రజాస్వామ్య బద్ధంగా పోరాటం కొనసాగిస్తామని సాకే నరేష్ తెలిపారు. అన్ని వెనుకబడిన వర్గాల ప్రజలు ఐక్యంగా ముందుకు సాగుతూ సామాజిక న్యాయం సాధనకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో బీసీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారాయణస్వామి, నరసింహులు, ఆదినారాయణ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

Editor, Published and Owned by C Hari Krishna, Published from D.no 1-3-780, Rajaka Nagar, Anantapur - 515001, Printed from NALIVELI EXPRESS PRINTERS Hno. 1-1A9T-10, Main Road, Pattikonda, Kurnool 518380, EDITOR : C HARI KRISHNA" Mobile number: 9182495405